**ఆత్మ, పరమాత్మల సంయోగమే సీతారాముల కల్యాణం**

**చక్కెరకంటె తీపి దధిసారముకంటెను**
**రుచ్యమౌను పెం**
**పెక్కిన తేనెకన్న అతి రుచ్యము**
**నోటను పల్క పల్కగా**
**మిక్కిలి కమ్మనౌ అమృతమే యనిపించును**
**కాన మీరు ఈ**
**చక్కని దాని మనసా**
**స్మరియింపుడు రామనామమున్**

**ప్రేమస్వరూపులారా!** రామాయణము పవిత్రమైన మార్గమును, పవిత్రమైన చర్యలను ప్రబోధిస్తున్నది. ఇది కేవలం ఒక వ్యక్తియొక్క చరిత్ర మాత్రమే కాదు; ఇది అందరికీ సంబంధించినది. ప్రతి వ్యక్తికూడను రామాయణమునకు సంబంధించినవారే!

దశరథుడు యజ్ఞపురుషుడు తనకు ప్రసాదించిన పాయసమును తన ముగ్గురు భార్యలకు సమానంగా పంచిపెట్టాడు. కౌసల్య ఎంతో ఆనందముతో, భక్తి శ్రద్ధలతో ఆ పాయసమును అందుకొని తన పూజా మందిరమునకు వెళ్ళింది. కైకేయికూడా అదేవిధంగా చేసింది. కౌసల్య పట్టపురాణి కావడంచేత తనకు పుట్టిన పిల్లవానికే రాజ్యాధికారము లభించగలదని ఆమె ఆనందంగా ఉన్నది. వివాహమునకు పూర్వం దశరథుడిచ్చిన వాగ్దానమును పురస్కరించుకొని తన కుమారుడే అయోధ్యా సింహాసనమును అధిష్ఠించ గలడని కైకేయి భావించింది. కాని, సుమిత్రకు అటువంటి కోరికలు లేవు. వాంఛారహితమైన మనస్సుతో, దివ్యమైన భావముతో ఆమె తన పాయసపు గిన్నెను అందుకొని మేడపైకి వెళ్ళింది. ఆ గిన్నెను ఒకచోట పెట్టి, దైవాన్ని స్మరిస్తూ కురులార్పుకోసాగింది. ఆమె చూస్తూండగానే ఎక్కడి నుండో ఒక గరుడపక్షి వచ్చి ఆ పాయసపు గిన్నెను తన్నుకొని పోయింది. తన పతి ఏమంటాడో అని భయపడుతూ, చాలా దిగులుతో ఆమె క్రిందికి దిగి వచ్చింది. కౌసల్య, కైకేయిలు ఎంతో ఆనందంగా ఆమెకు ఎదురు వచ్చారు. వారు ఈనాటి సవతులవలె ఒకరిపట్ల ఒకరు క్రోధముతో, ద్వేషముతో మెలగలేదు; ముగ్గురూ స్వంత అక్కచెల్లెళ్ళవలె ఎంతో ఆప్యాయంగా, ప్రేమగా సంచరిస్తూ వచ్చారు. కౌసల్య సుమిత్రను కౌగిలించుకొని, "చెల్లెలా! ఎందుచేత నీవు దుఃఖిస్తున్నావు?" అని ప్రశ్నించింది. కైకేయికూడా, "అక్కా! మనం ముగ్గురం ఒక్కటే కదా! నీ బాధకు కారణం ఏమిటో చెప్పు", అని అడిగింది. అప్పుడు సుమిత్ర జరిగిన సంగతి వివరించింది. వెంటనే కౌసల్య, కైకేయిలు వారివారి పూజా మందిరాలకు వెళ్ళి పాయసపు గిన్నెలను తీసికొని వచ్చారు. కౌసల్య తన పాయసమునుండి కొంతభాగమును, కైకేయి తన పాయసమునుండి కొంతభాగమును ఒక గిన్నెలో పోసి సుమిత్రకు అందించారు. ముగ్గురూ పాయసమును భగవదర్పితం గావించి భుజించారు.

కొంతకాలమునకు ముగ్గురు రాణులూ గర్భము ధరించారు. నవమాసాలు నిండిన తరువాత కౌసల్యకు మొదట ప్రసవ వేదన ప్రారంభమైనది. ఆమెకొక మగబిడ్డ పుట్టాడు. రెండవ దినము కైకేయికి ఒక పుత్రుడు కలిగాడు. మూడవ దినము సుమిత్రకు ఇరువురు కుమారులు జన్మించారు. దశరథుని ఆనందానికి అవధులు లేవు. ఆయన వచ్చి పిల్లలను ఆశీర్వదించాడు. అయితే, తాను యజ్ఞపాయసమును ముగ్గురు రాణులకు సమానంగా పంచిపెట్టినప్పటికీ సుమిత్రకు మాత్రం ఇరువురు కుమారులు కల్గడం ఆయనకు ఆశ్చర్యం కలిగించింది.

సుమిత్రకు ఇద్దరు పిల్లలు పుట్టడానికి తగిన కారణం లేకపోలేదు. ఆమె అంతవరకు ఆ సంగతి ఎవ్వరికీ చెప్పలేదు. నామకరణానికి పూర్వం దశరథ మహారాజు వచ్చి పిల్లలను ఆశీర్వదించే సమయంలో ఆమె ఆ గుట్టును బట్టబయలు చేసింది. "ప్రభూ! ఆరోజున నేను పాయసపు గిన్నెను ప్రక్కన పెట్టుకొని కురులార్పుకుంటూ ఉండగా, ఒక గ్రద్ద వచ్చి దానిని తన్నుకుపోయింది. అప్పుడు కౌసల్య తన పాయసంలో కొంత భాగమును, కైక తన పాయసంలో కొంత భాగమును కలిపి నాకందించారు", అని వివరించింది.

దశరథుడు వసిష్ఠులవారిని పిలిపించి, పిల్లల నామకరణమునకు తగిన ఏర్పాట్లు గావించాడు. ఋత్విక్కులందరూ శ్రవణానందంగా వేదమంత్రాలను పఠించారు. రాణులు తమ బిడ్డలను తీసికొని వచ్చి కూర్చున్నారు. "కౌసల్యకు, కైకేయికి ఒక్కొక్కరే పుట్టారు. సుమిత్రకు మాత్రమే ఇరువురు పిల్లలు పుట్టడానికి గల కారణమేమిటి?" అని ప్రజలు తమలో తాము గుసగుసలాడుకుంటూ వచ్చారు. దైవలీలలు ఎంత విచిత్రమైనవి! ఎవరు చెప్పగలరు!

నామకరణ మహోత్సవం ప్రారంభమైంది. కౌసల్య కుమారుడు మంచి బలవంతుడుగా, గుణవంతుడుగా, మహాతేజోవంతుడుగా ప్రకాశిస్తున్నాడు. వసిష్ఠులవారు ఆ బిడ్డయొక్క నామనక్షత్రానికి తగినట్లుగా పేరును నిర్ణయించి బియ్యంపై వ్రాసి పెట్టారు. రమించే గుణము కల్గినవాడు కనుక, ఆ బిడ్డకు 'రాముడు' అని పేరు పెట్టారు. తరువాత సుమిత్ర దగ్గరకు వచ్చారు. ఆమె ఒళ్ళో పరుండిన ఇరువురు బిడ్డలను చూశారు. ఒక బిడ్డ మహా శౌర్యవంతునిగా కనిపించాడు. ఆ బిడ్డ ముఖముపై దివ్యకళ తాండవమాడుతూ వచ్చింది. ఈ శుభలక్షణాలను పురస్కరించుకొని ఆ బిడ్డకు 'లక్ష్మణుడు' అని పేరు పెట్టారు. సుమిత్ర రెండవ బిడ్డ శత్రుసంహారకుడుగా కనిపించాడు. కాబట్టి, అతనికి 'శత్రుఘ్నుడు' అని నామకరణం చేశారు. తరువాత, కైకేయివద్దకు వెళ్ళారు. ఆమెకు పుట్టిన కుమారునికే పట్టాభిషేకము చేస్తానని దశరథుడు పెండ్లికి పూర్వమే వాగ్దానము చేశాడు. కనుక, తన కుమారుడే భారత దేశమునకంతటికీ నాయకుడవుతాడని ఆమె ఎంతో ఆనందంగా ఉంది. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని వసిష్ఠులవారు కైకేయి కుమారునికి 'భరతుడు' అని నామకరణం చేశారు.

కౌసల్య, కైకేయి ఇరువురూ చాలా ఆనందంగా ఉన్నారుగాని, సుమిత్రను మాత్రం ఒక చింత చాలా బాధపెడుతూ వచ్చింది. ఆమె బిడ్డలు ఇరువురూ నిద్రాహారాలు మాని నిరంతరం ఏడుస్తూ ఉండేవారు. సుమిత్ర ఈ విషయాన్ని దశరథునితో చెప్పింది. కాని, ఆయన మాత్రం ఏమి చేయగలడు! 'భగవంతుని సంకల్పం ఎలా ఉంటే అలా జరుగుతుంది. భగవత్ ప్రార్థన చేసుకో', అని ఆమెకు బోధించాడు. ఇలా మూడు రోజులు గడిచిపోయాయి. ఈ పిల్లలు మాత్రం పాలు త్రాగరు, నిద్ర పోరు; ఏడుస్తూనే ఉన్నారు.

ఇక, సుమిత్ర బాధను భరించుకోలేక వసిష్ఠులవారి దగ్గరకు వెళ్ళి, "స్వామీ! నా బిడ్డలు నిరంతరం ఏడుస్తూనే ఉన్నారే! దీనికి కారణమేమై వుంటుంది?" అని అడిగింది. ఆయన దివ్యదృష్టితో పరికించి, "అమ్మా! ఆరోజున నీ పాయసపు గిన్నెను గద్ద తన్నుకొని పోయినప్పుడు కౌసల్య, కైకేయిలు తమ పాయసము నుండి చెరిసగం నీకిచ్చారు కదా! కౌసల్య ఇచ్చిన పాయసమునుండి పుట్టినవాడు లక్ష్మణుడు. కాబట్టి, అతను రాముని అంశము. అట్లే, కైకేయి ఇచ్చిన పాయసమునుండి పుట్టినవాడు శత్రుఘ్నుడు. అతను భరతుని అంశము. కాబట్టి, నీవు లక్ష్మణుని తీసుకువెళ్ళి రాముని ఊయలలో పరుండబెట్టు. అట్లే, శత్రుఘ్నుణ్ణి భరతుని ప్రక్కన పరుండబెట్టు", అని సలహా ఇచ్చారు. సుమిత్ర ఆయన చెప్పినట్లు చేసింది. ఆ క్షణంనుండి లక్ష్మణ, శత్రుఘ్నులు ఏడ్పు మాని వేళకు భుజిస్తూ, వేళకు నిద్రిస్తూ ఆనందంగా కాలము గడుపుతూ వచ్చారు.

లక్ష్మణుడు నిరంతరము రామచంద్రుని అడుగు జాడలను అనుసరిస్తూ వచ్చాడు. అట్లే, శత్రుఘ్నుడు ఎల్లప్పుడు భరతుని వెంట ఉండేవాడు. లక్ష్మణుడు రాముని అంశమని, శత్రుఘ్నుడు భరతుని అంశమని సుమిత్ర అర్థం చేసుకుంది. ఆమె తన ఇరువురు సిస్టర్స్‌తో చెప్పింది, "అమ్మా! మీకు పుట్టిన కుమారులు రాజ్యము నేలవచ్చును. కాని, నాకు అటువంటి కోరికలు లేవు. నా కుమారు లిరువురూ మీ కుమారుల సేవలో ఆనందంగా కాలము గడిపితే చాలు".

లక్ష్మణుడు రాముని అంశము కాబట్టి, అతడు నిరంతరం రాముని సేవయందే ఆనందంగా కాలము గడపాలని ఆశించింది, సుమిత్ర. అట్లే, శత్రుఘ్నుడు భరతుని సేవించాలని ఆశించింది. ఈ మర్మము, ఈ రహస్యము దశరథునికికూడా తెలిసింది. ఎట్లాగైతే నేమి, ముగ్గురు భార్యలు పిల్లలతో ఆనందంగా కాలము గడుపుతున్నారు కదాయని తాను సంతోషించాడు.

కష్టసుఖములు ఒకదానినొకటి వెంటాడుతూనే ఉంటాయి కదా! దశరథునికి కాలము ఆనందంగా గడచిపోతుండగా ఒకనాడు విశ్వామిత్రుడు వచ్చి, 'మహారాజా! నేను నీవద్దనుండి ఒక సహాయమును ఆశించి వచ్చాను', అన్నాడు. మరో ఆలోచన లేకుండా దశరథుడు, ఏమి కావలసినా తప్పక చేయగలనని వాగ్దానం చేశాడు. 'నేనొక యజ్ఞమును తలపెట్టాను. రాక్షసుల బారినుండి ఆ యజ్ఞమును సంరక్షించడానికి రాముణ్ణి

నావెంట పంపించు', అని కోరాడు, విశ్వా మిత్రుడు. అది విని దశరథుడు చాలా ఆందోళనకు గురి అయినాడు. "మహర్షీ! రాముడు చిన్నపిల్లవాడు, సుకుమారుడు. క్రూరులైన రాక్షసులతో పోరాడే నిమిత్తం అతనిని నేనెలా పంపగలను!" అన్నాడు. విశ్వామిత్రునికి కోపం వచ్చింది. 'దశరథా! ఇక్ష్వాకు వంశములో ఇంతవరకు ఆడినమాట తప్పినవారు లేరు. ఆడిన మాట తప్పడం మహాపాపం. అది చాలా ప్రమాదానికి దారితీస్తుంది', అని హెచ్చరించాడు.

విశ్వామిత్రుని కోరిక ఏవిధంగా నెరవేర్చాలి, అని దశరథుడు యోచనలో పడ్డాడు. వసిష్ఠులవారిని సంప్రదించగా ఆయన ధైర్యం చెబుతూ, "మహారాజా! అంతా భగవత్సంకల్పానుసారమే జరుగుతుంది. నీవు మరో ఆలోచన పెట్టుకోకుండా రాముణ్ణి విశ్వామిత్రుని వెంట పంపించు", అని సలహా ఇచ్చారు. అప్పుడు దశరథుడు, 'రామా! ఇటు రా', అని పిలిచాడు. రాముని వెంట లక్ష్మణుడుకూడా అక్కడికి వచ్చాడు. లక్ష్మణుని ఎవ్వరూ పిలువలేదు. తనంతట తానే రామునితోపాటు వచ్చి కూర్చున్నాడు. వచ్చిన వీరుణ్ణి వెనుకకు పంపడం ఎవరికీ ఇష్టం లేకపోయింది. 'సరే, ఇదికూడా భగవత్ సంకల్పమే!' అని భావించి దశరథ మహారాజు రామలక్ష్మణు లిరువురినీ విశ్వామిత్రుని వెంట పంపించాడు.

ముగ్గురూ సరయూ నదీ తీరమును చేరుకున్నారు. విశ్వామిత్రుడు, 'రామలక్ష్మణులారా! ఈ నదీ తీర్థము చాలా పవిత్రమైనది. ఇక్కడ సంధ్య వార్చుకోండి', అని చెప్పాడు. రామలక్ష్మణులు సంధ్య వార్చుకొని, కన్నులు మూసుకొని ధ్యానం చేస్తూ కూర్చున్నారు. ఆ సమయంలో విశ్వామిత్రునికి ఒక సంకల్పం కలిగింది. 'యజ్ఞయాగాదులకు వచ్చిన పిల్లలుగాని, పెద్దలుగాని నిద్రాహారములు లేకుండా ఉండవలసివస్తుంది. వేళకు భుజించి, వేళకు నిద్రించే ఈ రాకుమారులు నిద్రాహారములు మాని ఏవిధంగా యాగసంరక్షణ గావించగలరు?' అని ఆలోచించాడు. అప్పుడు వారికి 'బల, అతిబల' అనే రెండు మంత్రాల నుపదేశించాడు. "రామలక్ష్మణులారా! ఈ మంత్రముల ప్రభావముచేత నిద్ర, ఆకలిదప్పులు మిమ్మల్ని ఏమాత్రం బాధించవు. మీరు ఉత్సాహంగా యాగసంరక్షణ గావించడానికి వీలౌతుంది", అని చెప్పాడు.

అక్కడినుండి బయలుదేరి ముగ్గురూ సిద్ధాశ్రమం చేరుకున్నారు. విశ్వామిత్రుడు యజ్ఞమును ప్రారం భించాడు. ఆయన ఉపదేశించిన మంత్రాలను జపిస్తూ రామలక్ష్మణులు రాత్రింబవళ్ళు యజ్ఞాన్ని సంరక్షించు కుంటూ వచ్చారు. రాక్షసులు భయంకరమైన శబ్దాలు చేస్తూ యజ్ఞమునకు ఆటంకం కలిగించడానికి అనేక విధములుగా ప్రయత్నించారు. రామలక్ష్మణులు చిరునవ్వుతో వారిని ఎదుర్కొన్నారు. గురువాజ్ఞను పురస్కరించుకొని రాముడు తాటకిని సంహరించాడు; మారీచుణ్ణి కొన్ని వేల యోజనాల దూరంలో పడిపోయేటట్లు చేశాడు; సుబాహుణ్ణి అంత మొందించాడు. ఈరీతిగా, రామలక్ష్మణుల సంరక్షణలో విశ్వామిత్రుని యజ్ఞము నిర్విఘ్నంగా పూర్తయింది. విశ్వామిత్రుడు ఎంతో సంతోషించి సోదరు లిరువురినీ ఎంతో ప్రేమతో ఆశీర్వదించాడు.

ఇంతలో మిథిలానగరమునుండి ఒక వర్తమానం వచ్చింది. జనకుడు తాను తలపెట్టిన యాగమునకు విచ్చేయవలసిందిగా విశ్వామిత్రుని ఆహ్వానిస్తూ ఒక లేఖ పంపించాడు. విశ్వామిత్రుడు రామలక్ష్మణులతో, "నాయనలారా! మిథిలనుండి మనకు ఆహ్వానము అందినది. జనక మహారాజు చేస్తున్న యజ్ఞమును చూడడానికి మీరుకూడా తప్పక రావాలి", అన్నాడు. అప్పుడు రాముడు, "గురుదేవా! మా తండ్రిగారు మీ యజ్ఞమును సంరక్షించే నిమిత్తమై మమ్మల్ని పంపినారు గాని, మిథిలానగరమునకు వెళ్ళి జనక మహారాజు చేస్తున్న యజ్ఞములో పాల్గొనమని చెప్పలేదు కదా!" అన్నాడు. వెంటనే విశ్వామిత్రుడు, "నాయనా! మీ తండ్రిగారి ఆజ్ఞ ఏమిటి? విశ్వామిత్ర మహర్షి చెప్పినట్లు నడుచుకొమ్మని మిమ్మల్ని ఆదేశించారు కదా! కాబట్టి, మీరు మరో ప్రశ్న వేయకుండా నన్ను అనుసరించండి", అని చెప్పాడు. రామలక్ష్మణులు ఏమి చేయగలరు! మారుమాట్లాడకుండా విశ్వామిత్రుని వెంట మిథిలకు బయలుదేరారు.

మిథిలాపుర ప్రజలు రామలక్ష్మణులను చూసి, "ఎవరీ రాజకుమారులు? ఎంత అందంగా ఉన్నారు! గొప్ప వీరులుగా, తేజోవంతులుగా కనిపిస్తున్నారు. జనక మహారాజు తన బిడ్డలను వీరికిచ్చి వివాహం చేయనున్నాడా?" అని వారిలో వారు మాట్లాడుకుంటూ వచ్చారు.

సీత, ఊర్మిళ ఇరువురూ జనక మహారాజు బిడ్డలు. జనకుడు శివధనుస్సును ఎక్కుపెట్టిన వీరునికి సీతనిచ్చి వివాహము చేస్తానని ప్రకటించాడు. అనేక మంది రాజులు వచ్చి ప్రయత్నించారు. కాని, శివధనుస్సును ఎవ్వరూ

ఎత్తలేకపోయారు. అప్పుడు విశ్వామిత్రుని ఆదేశము మేరకు రాముడు వెళ్ళి శివధనుస్సును సునాయాసముగా ఎత్తి, అల్లెత్రాటిని ఎక్కించినాడు. బాణమును కూర్చి అల్లెత్రాటిని ఆకర్ణాంతము లాగినాడు. అది పెద్ద శబ్దం చేస్తూ విరిగిపోయింది. సభాసదులు సంభ్రమాశ్చర్యచకితులై జయజయధ్వానాలు చేసినారు.

సీత రాముని మెడలో మాల వేయడానికి సిద్ధంగా ఉంది. కాని, రాముడు మాత్రం వివాహానికి సిద్ధంగా లేడు. విశ్వామిత్రునికి నమస్కరించి, "స్వామీ! మీరు మమ్మల్ని యజ్ఞసంరక్షణార్థం తీసుకువచ్చారుగాని, వివాహముకోసం తీసుకు రాలేదు. మా తండ్రిగారి అనుమతి లేకుండా నేను ఈ వివాహానికి అంగీక రించను", అన్నాడు. విశ్వామిత్రుడు చిక్కులో పడ్డాడు. సభలో అందరూ నిశ్శబ్దంగా ఉన్నారు. "ఏమిటి, ఈ పిల్లవాడు వివాహానికి అడ్డు చెబుతున్నాడే!" అని ఆశ్చర్యపడుతూ వచ్చారు. జనక మహారాజు తక్షణమే అయోధ్యకు కబురు పంపించాడు. ఈ శుభవార్తను విని దశరథ మహారాజు, కౌసల్య, సుమిత్ర, కైకేయిలు, భరత శత్రుఘ్నులు, అయోధ్యా ప్రజలు పట్టలేని ఆనందంతో ఉప్పొంగిపోయారు. అంతా కలసి ఆనందోత్సాహాలతో మిథిలానగరానికి తరలి వచ్చారు.

జనకుని రెండవ కుమార్తె పేరు ఊర్మిళ. ఆయన తమ్మునికి మాండవి, శ్రుతకీర్తి అని ఇరువురు బిడ్డలు. ఊర్మిళను లక్ష్మణునికి, మాండవిని భరతునికి, శ్రుతకీర్తిని శత్రుఘ్నునికి ఇచ్చి వివాహం జరిపించ డానికి అనుమతి ఇవ్వవలసిందిగా జనక మహారాజు దశరథుని ప్రార్థించాడు. 'సరే, నలుగురూ ఒకే సమయంలో పుట్టారు. కాబట్టి, నలుగురికీ ఒకే సమయంలో వివాహము జరగడం మంచిదే' అని భావించి దశరథుడు సంతోషంగా తన అంగీకారాన్ని తెలిపాడు. వివాహ మహోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు జరిగాయి. ఇంక, మిథిలాపుర ప్రజల ఆనందానికి అవధులు లేవు. పవిత్రమైన సీతారామ కల్యాణమును చూడడానికి స్త్రీలు ఇలా పాడుకుంటూ బయలుదేరారు:

రారే చూడగ పోదాము రాముని పెండ్లి
రారే చూడగ పోదాము రమణులందరు కూడి
వింతల బంగళాలు, ముత్యపు తోరణాలు
మూలల కిటికీలు, వజ్రాల తలుపూలు
తాపిన నీలాలు, నీలాలు వెయ్యార్లు
నూరార్లు బజార్లు ।రారే॥
స్త్రీల కెక్కువ భూషణాలు, ముందర దర్బార్లు
సీతకు రాముడు సూత్రము గట్టుతాడు
ఇద్దరి నొక్క ఈడుజోడుగ గూర్చినాడు
సీతకు తగువాడు శ్రీరాముడు ॥రారే॥
మించి మగల కడనుంచి సిగ్గున తలవంచి
వసిష్ఠ రప్పించి ఖడ్గములు తెప్పించి
గుఱ్ఱాలపై గుప్పించి, గుప్పించి, ఇప్పించి
మెప్పించి రప్పించుట ॥రారే॥

ఒకవైపున స్త్రీలు తరలి వస్తుంటే, మరొక వైపున పురుషులు ఈవిధంగా పాడుకుంటూ వస్తున్నారు:

కల్యాణము చూతము రారండి!
కౌసల్యా తనయుని కల్యాణము చూతము రారండి!
అయోధ్యావాసుని కల్యాణము చూతము రారండి
చూచువారలకు చాల పుణ్యమట
పుణ్యపురుషులకు ధన్యభాగ్యమట
॥కల్యాణము॥

అంబారిపై అలఘు తేజమట
ధగధగ మెరిసెడి దివ్య రాములట
రామయంకమున రమణి సీతయట

సీతారాముల సోదర సేవట
చిరునవ్వుతో మన క్షేమ మడుగునట
క్షేమమే అడిగిన మనకిక కొదువా
కదలరె కదలరె బదులిక పలుకక

॥కల్యాణము॥

సీతారాముల వివాహ మహోత్సవము అత్యంత వైభవంగా జరిగింది. సీత రాముని మెడలో పూలమాల వేయవలసి ఉండినది. ఆమె మాల పట్టుకొని నిలబడింది. రాముడు ఆజానుబాహుడు, సీత చాలా పొట్టిది. రాముడు ఆమె ముందు తలవంచడం లేదు. ఎంత ప్రయత్నించినా సీతకు రాముని మెడలో మాలవేయడం సాధ్యం కాలేదు. ఏమి జరుగుతున్నదో ఎవరికీ అర్థం కాలేదు. మిగిలిన ముగ్గురు వధువులూ మాలలు పట్టుకొని సిద్ధంగా ఉన్నారు. కాని, మొదట సీతారాముల కల్యాణం జరిగిన తరువాతనే మిగిలినవారి కల్యాణం జరగాలి. అప్పుడు లక్ష్మణుడు ఒక యుక్తిని పన్నాడు. తాను రాముని పాదాలకు సాష్టాంగ నమస్కారం చేశాడు. అతనిని లేవనెత్తడానికి రాముడు ముందుకు వంగాడు. రాముడు ఎప్పుడైతే శిరస్సు వంచినాడో సీతకు మంచి ఛాన్సు చిక్కింది. తక్షణమే ఆమె రాముని మెడలో మాల వేసింది. ఆ తరువాత మిగిలిన ముగ్గురు పెళ్ళి కుమార్తెలు పెళ్ళి కుమారుల కంఠసీమలను పూలమాలలతో అలంక రించారు. ప్రజలందరూ ఆనందబాష్పాలు రాల్చారు; ముక్తకంఠాలతో జయజయ ధ్వానాలు చేశారు.

నలుగురు సోదరులూ తమ పత్నులతోకూడి అయోధ్యకు చేరుకున్నారు. వేదమంత్రాలతో, మేళ తాళాలతో అయోధ్యా ప్రజలు వీరికి స్వాగతం పలికారు. రాజసౌధముయొక్క సింహద్వారమువద్ద కౌసల్య, సుమిత్ర, కైకేయిలు తమ కుమారులకు, కోడళ్ళకు హారతి ఇచ్చి లోపలకు తీసుకు వెళ్ళారు.

చిత్రంబులు త్రైలోక్య ప
విత్రంబులు భవలతా లవిత్రంబులు స
న్మిత్రంబులు మునిజన వన
చైత్రంబులు రామదేవుని చారిత్రంబుల్

రామదేవుని దివ్య చరిత్ర చాలా చిత్రవిచిత్రములతో కూడినటువంటిది. ఈనాడు అందరూ సీతారాముల కల్యాణ మహోత్సవం జరుపుకుంటున్నారు. అయితే, సీతారాముల కల్యాణము ఎప్పుడు జరిగిందీ, ఎట్లా జరిగిందీ ఎవ్వరికీ సరిగా తెలియదు. కల్యాణము తరువాత రాముడు అనేక బాధలను అనుభవించాడు. అనేకమంది రాక్షసులతో యుద్ధం చేశాడు. రామునికి మొట్టమొదటి అస్త్రము లక్ష్మణుడే. ఈవిధంగా, సోదరులయొక్క ఏకత్వముచేతనే రాముడు విజయాన్ని సాధించగలిగాడు. ఆనాటి సోదరప్రేమ అంత గొప్పది. 'నా సోదరులు నాకంటే గొప్పవారు. నా సోదరుల ఐకమత్యముచేతనే నేను విజయాన్ని సాధించాను', అని రాముడు తన సోదరులను ఎంతగానో మెచ్చుకున్నాడు.

రామనవమి అనగా కేవలం రాముని పుట్టిన దినము కాదు. రామకల్యాణమనగా రాముడు సీతను వివాహమాడడం ... ఇది మాత్రమే కాదు. రాముడు ఏవిధమైన అనుగ్రహముతో పుట్టాడు? తాను ఏవిధముగా విజయాన్ని సాధించాడు? అనే రహస్యాన్ని మీరు చక్కగా గుర్తించాలి. రామకల్యాణమనగా జీవితముయొక్క ఆత్మకల్యాణమే. ఆత్మను పరమాత్మతో చేర్చడమే ఈ కల్యాణము. వ్యక్తిగతమైనది కాదు ఇది.

(2005 ఏప్రియల్ 18వ తేదీ రామనవమి సందర్భంగా సాయికుల్వంత్‌లో భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం)